

రాత్రి పన్నెండయింది. ఊరంతా నిద్ర పోతోంది. ఊరిచుట్టూ ఉండే చెట్లూ చేలూ అన్నీ నిద్రపోతున్నాయి. (అవును; చెట్లుకూడా కూడా నిద్రపోతాయిట.) ఊరి చివర కమ్మల గుడిసె ఒకటుంది. అందులో ఓ ఆడమనిషీ, ఇద్దరు చిన్న పిల్లలూ నిద్రపోతున్నారు. పాక పైట పండు వెన్నెల్లో (వళ్ళ గుత్తుల్ని ఆకుల పైట చాటున దాచుకోడం మర్చిపోయి మధురాతి మధుర స్వప్నాలు కంటూనే కాబోలు) జామిచెట్టొకటి నిద్రపోతోంది. ఆ జామిచెట్టుకింద కోళ్ళగూడొకటుంది. అందులో ఒకేఒక కోడిపెట్ట ఉంది. కోళ్ళగూడు నిద్రపోతోందో లేదో తెలీదు. ఆ భోగట్టా శాస్త్రజ్ఞులు చెప్పాలి. కథకులు కరెక్ట్‌గా చెప్పజాలరు.

కోడిపెట్టమాత్రం ఆ కోళ్ళగూట్లోకూర్చొని కళ్ళు మూసుకొందేకాని నిద్రపోలేకపోతోంది. అసలే దాన్ది కోడి కునుకు, అందులోనూ దాన్ది భయం బతుకు. అందులోనూ అది ఈ మధ్యే స్థలం మారింది. అందుచేత దానికి చాలా బెంగగా ఉంది. స్థానచలనం దానికి బొత్తిగా ఇష్టంలేదు. కాని కోడిపెట్టల ఇష్టాఇష్టాల ప్రకారం లోకం నడవదుకద!

---

"జాస్మిన్" (అంటే రాచకొండ విశ్వనాథ శాస్త్రి)

---

కన్ను మూసుకొని. మధ్య మధ్య కన్ను తెరుస్తు కోడి పెట్ట ఏమేమో ఆలోచిస్తూ కూర్చుంది. లోకంతీరుకాని, బతుకులోని భావం కాని దాని కేమీ అర్థం కాకుండా ఉంది, హిమాలయాలగుహల్లో సన్యాసులు చలి చలిగా కూర్చునట్టు ఆ కోళ్లగూడుకింది అది భయం భయంగా కూర్చుంది. దానికి నిద్ర రావడం లేదు. బాధల భయాల వాళ్లకి సరిగా నిద్ర ఉండవు.

దొంగలకి కూడా నిద్రలుండవు. వాళ్లెప్పుడూ తెలివిగా ఉంటారు, చలాకీగా ఉంటారు. చంద్రుడు అలానే ఉన్నాడు. పట్టపగ్గాల్లేకుండా విర్రవీగుతూ తిరుగుతున్నాడు. కాని, చాలా అందంగా ఉన్నాడు. గురువుగారికే ఎసరుపెట్టిన పక్కా దొంగే అయినప్పటికీ అతను - కవులు తనగురించి రమణీయమైన పదాలతో రమ్యమైన కావ్యాలు రాయడానికి వీలుగా - ఎంతో అందంగా ఉన్నాడు. అయనేకాని భూమ్మీదకి దిగితే ఏ చోర సామ్రాజ్యానికి చక్రవర్తో, ఏ దొంగల దేశానికి ప్రెశిడెంటో అయి తీరగలడు.

చంద్రుళ్ళా అందంగా లేకపోయినా, వీరన్న కూడా అతన్లాగే మేలుకొనే ఉన్నాడు.

జామిచెట్టువైపు కళ్ళు విప్పుకు చూస్తూ, ఆ కమ్మల గుడిసె చూరు నీడలో కూర్చున్నాడతను. వెన్నెల అతని కళ్ళల్లో వింతగా పాదరసం మెరిసినట్టు మెరుస్తోంది. అతని చేతిలో ఓ బాణాకర్ర ఉంది. అది పని కోసం వెయిట్ చేస్తోన్న వస్తాదులా ఉంది.

వీరన్న చేతిలో ఉన్న బాణాకర్ర వీరన్నది కాదు. వెంకడి దగ్గర్నించి అది అతను ఎరువు తెచ్చేడు. కమ్మలపాకలో పడుకున్న ఆడమనిషి ఏడాది క్రితం అతనిది కాదు. అవిణ్ని అతను లేపుకొచ్చి ఏడాదే అయింది. పాకలో పడుకున్న ఇద్దరుపిల్లల్లోనూఓఆడపిల్లఅతనిదికాదు. ఆమెని ఆ లేచివచ్చిన తల్లి తీసుకొచ్చింది. మగ కుర్ర వోడు మాత్రం వీరన్న కొడుకే. కాని, ఆ పిల్లడి తల్లిని వీరన్న ఏడాది క్రితం తన్ని తగిలేసేడు,

పంచె ఎగ్గట్టి, చొక్కాతీసేసి కర్ర పట్టుకుని నిశ్చలంగా కూర్చొని ఉన్నాడు వీరన్న. నిశ్చలంగా ఉన్నాడేకాని, పశువుకోసం పొంచి కూర్చున్న పెద్దపులిలా అతి మెలకువగా ఉన్నాడు.

రాత్రి పన్నెం డయింది. పండు వెన్నెల్లో ఊరవతలి జోడు బోడికొండలు బద్ధకంగా పడుకున్నాయి. కొండలపక్క బంజర్లో తుమ్మ దొంకల్లోంచి పుట్టల్లోంచి లేచిన పాములు ఊరి వైపు చేలోకి ఎలకల నిమిత్తమో, చెరువు వైపు కప్పల నిమిత్తమో పయనమయేయి. గుడ్లగూబలు గుడ్లు విప్పుకు చెట్లు కాసేయి. గబ్బిలాలు ఎంతో నిశ్శబ్దంగా- కాని- ఎంతో హడావిడిగా ఎగురుతూ తిరుగుతున్నాయి.

కొండపక్క బొరియలోంచి ఓ నక్క నెమ్మదిగా లేచింది.

బొరియలో మూడు నక్కపిల్ల లున్నాయి. అవి చాలా ముద్దుగా మెత్తగా జాలిగా, భయంగా ఉన్నాయి. బొరియలోంచి బైటికి లేచిన తల్లి వైపు అవి బితుకూ బితుకూ చూసేయి.

పిల్లల్ని చూసిన తల్లి నక్క కరుణతో కరిగి పోయింది.

"అయ్యో! పిచ్చి పిల్లల్లారా! బెంగ పెట్టుకోకండర్రా! అలా వెళ్ళి ఇప్పుడే వచ్చేస్తాను. వెళ్ళకపోతే ఎలా కుదురుతుందో చెప్పండి! వెళ్ళి బువ్వ తెచ్చుకోవాలా? మీరు చిన్న పిల్లలు. మీకేం తెలీదు. కష్టపడకపోతే కూడు దొరకదమ్మా! నేను కష్టపడితేనే నాకు బతుకు, మీకు బతుకు. మీరు పెద్ద వాళ్ళయి, మీకూ కాళ్ళకి పరుగులొచ్చి పళ్ళకి పదునొస్తే మీరూ లోకం మీదపడి బతకొచ్చు కాని, అందాకా నాకోసం మీకోసం కూడా నేను తిరక్క తప్పదు. అలా వెళ్ళి రానీయండమ్మా:"


అన్నట్టుగా పిల్లల్ని మూర్కొని తల్లినక్క కొండవారనుండి కోసుదూరాన్న ఉన్న పల్లె వైపు బయల్దేరింది.

వెన్నెల చల్లగా ఉంది. తుమ్మలు దొంగల్లా ఉన్నాయి. రాళ్లు బండగా ఉన్నాయి. దొంగ గెడ్డలో ఇసక మెత్తగా ఉంది. వల్లకాడు శవరహితంగా, ముండమోపిలా ఉంది. జామతోటలో చచ్చుడివాళ్ళ కుక్క మొరుగుతూ

ఉంది. దుంగా దొంగనాయుడి గరువులో నిల్చిన మేకలమందలికి కాపలాగా ఇద్దరు గొల్లలు మేలుకొని ఉన్నారు. చేలు పచ్చగా ఉన్నాయి. ఒకదాని భుజం మీద ఒకతె తలలు వాల్చుకొని సస్యాలు మైమరిచి మధురంగా నిద్రపోతున్నాయి. అంగటిబావి దగ్గిర చిరిగిపోయిన రేకుచేదలూ, పగిలిపోయిన కుండ పెంకులూ దిక్కుమాలి పోయి పడున్నాయి. పక్కనేఉన్న కొబ్బరి తోటలో చెట్లనుంచి కాయలు ముగ్గురు దొంగల చేత భద్రంగా దింపబడుతూ ఉన్నాయి. మురికి కాలవ దగ్గిర ఊరపందులు నిద్రలో కూడా తమ పిల్లల్ని కాసుకునున్నాయి. ఊరికి ఇటువైపు పేదవారివాడలో(మనుష్యులేతినబడుతూండటం చేత) నక్కలకి భుక్తి దొరికే జాగాలేమీ లేకుండా ఉన్నాయి. మరోపక్క రాజుగారి దివాణం కోటలా ఉంది, సెట్టిగారి ఇల్లు ఊరికి మధ్యగా పెట్టెలా ఉంది. భోంచేసి పడుకున్న బ్రాహ్మల కడుపుల్లో అన్నాలు అరుగుతూ ఉన్నాయి. పెద్ద నాయుళ్ళ కోడిపెట్టలూ పుంజులూ పిల్లలూ వారి వారి ఇళ్ళలో ఎంతో భద్రంగా దాచబడి ఉన్నాయి. వారి పశువులు నెమరువేస్తూ నిద్రలోకూడా కొమ్ములువిసురుతూ ఉన్నాయి.

తల్లినక్క రివ్వు రివ్వున పరిగెడుతూ అక్కడక్కడ ఆగుతో శత్రు శిబిరాన్ని ఆర్మీస్కౌట్ పరీక్షించినట్టు ఊరంతటినీ దూరం నించి పరీక్షిస్తూ ఊరిచుట్టూ తిరగడానికి ఉపక్రమించింది.

నక్కతల్లికి చాలా ఆకలిగానూ, ఆవేదనగానూ ఉంది. కడుపులో మంటవల్ల దాని మనసులో పిచ్చిపిచ్చి ఆలోచనలు చెలరేగుతున్నాయి. మునీశ్వరులు ఒంటికాలిమీద ఏళ్ళ కొద్దీ నిలబడి తపస్సు చేసినట్టు అది నాలు క్కాళ్ళమీదా గంటలతరబడి పరిగెడుతూ ఆలో చిస్తోందేకాని ఆకలివేడి తప్ప లోకంలో దానికి ఇంకేమీ కనిపించడంలేదు. ఎంత తిరిగినప్పటికీ ఏమీ దొరక్కపోడంతో దానికి



కరుణామయుడైన భగవంతుణ్ని కేదారగౌళలో తిడదామన్నంత కోపం వచ్చింది.

కొండవారనించి బయల్దేరి వస్తే ఊరికి ఉత్తరపుకొస ముందుగా తగుల్తుంది. దక్షిణపు కొసదాకా వెళ్లాలంటే మధ్యలో ఎన్నో దేంజర్లున్నాయి. దార్లో కాలవొకటుంది. దాన్ని తాటివంతెన మీంచి దాటాలి. అందుమీంచి జారి పడితే బురదలో కూరుకు చావాలి. "అయ్యో, దేవుడా! ఒక్కకునుకు వెధవ నక్కకే దాని తిండికీ మధ్య ఎన్ని యమయాతనలు పెట్టేవురా తండ్రీ!" అని నక్కభాషలో భగవంతుణ్ని నిందిస్తూ పరిగెడుతోంది తల్లినక్క. "సరే, మరైతే. ఇంక, ఆ దిక్కుకే నిన్న మొన్న చోటుకే పోవాలి! అక్కడ ఇవాళ కూడా నాకో కోడిపెట్టని రాసిపెట్టేడో లేక ఇంకేం పైనా రాసిపెట్టేడో రాక్షసి దేవుడు!", అనుకొంటూ దక్షిణానికి దారి మళ్ళించింది నక్కతల్లి.

ఆలస్యం అవుతూన్న కొద్దీ వీరన్నకి వేడి ఎక్కువవుతోంది. రెండు గంటలు దగ్గిరవుతోంది. ఇంకా ఆలస్యం అయిందంటే అతను కుతకుత ఉడకవచ్చు, లేదా, భగభగ మండవచ్చు.

ఎంతో సాహసించి. ఎంతో శ్రమపడి అతను మూడ్రోజుల కిందట మూడు కోడిపెట్టల్ని తీసుకువచ్చేడు, ఆరోజే వాటిని టౌనుకి తీసుకుపోయి "అమ్మేద్దామనుకొంటే", ఏదో కేసులో "ఇన్పరొమేసన్" కావలని వచ్చి పోలీసువారు అతణ్ని తీసుకుపోయి "ఇయాల సాయింకాలివేల" విడిచి పెట్టేరు. ఇంటికి వచ్చీరాగానే "మూడు పెట్లల్లో నూ రొండు పెట్టలు పోనాయి!" అని శుభవార్త అందజేసింది వరాలమ్మ. ఎలా పోయేయని అడిగితే "నక్కెత్తుకు పోనాది!?" అంది వరాలమ్మ. "నక్కెత్తుకు పోనాదా?" ఆహాఁ!! నీయమ్మ మొగుడెత్తుకు పోనేదూ?!" అంటూ వరాలమ్మని వీరన్న చితక్కొట్టేసేడు. ఆవిడ తన కన్నవారికి ఆ పెట్టల్ని ఇచ్చేసైనా ఉండాలి. లేదా, అమ్ముకొని డబ్బు చేసుకొని ఆ డబ్బు దాచేసి అయినా ఉండాలి — అని అతనిఅనుమానం. అందువల్లనే అతనావిణ్ని చితగ్గొట్టేసేడు. కాని తన కొడుకూ ఆవిడ కూతూరూ కూడా నక్కే నేరం చేసిందని ఏకకంఠంతో చెప్పేసరికి అతనికి ఆ మాట నమ్మక వీల్లేక పోయింది.

కష్టపడి సంపాదించిన కోడిపెట్ట పోయినందుకు వీరన్నకి కోపం వచ్చింది. రెండో కోడిపెట్టనికూడా ఎత్తుకుపోయినందుకు ఆ నక్కమీద అతనికి రెండింతల కోపం వచ్చింది. తన చేత పొరపాటుగా వరాలమ్మని కొట్టించినందుకు ఆ నక్కమీద అతనికి మూడింతల కోపం వచ్చింది.

ఓ సుట్టు టౌన్లో సొట్టబుర్రోడు కేడీ పని చేస్తే ఆ నేరానికి గున్నమ్మ కొడుకుని కొట్లో ఏసేసేడు ఎస్సయ్యా! ఆ యెనక తప్పు కానుకున్నాక ఎస్సయ్యా ఆ సొట్ట బుర్రోణ్ణి ఒట్టుకెళి పోయి మూడ్రోజులు కొట్లో ఎట్టి కుళ్ళబొడిసీసినాడు. ఇనసాల్టు పీలయినాడు ఎస్సయ్యా! అందుకూ ఆణ్ని అలా కుళ్ళబోడిసీసివాడు:

వీరన్నని దొంగనక్క "ఇనసాల్టుజేసినాది!" అతనికి అపకారం చెయ్యడమే కాకుండా అతణ్ని అది అనుమానించింది కూడాను! అందుకే అతను ఆ నక్కమీద పగబట్టి పులి కోపంతో అలా పొంచికూర్చున్నాడు.

మొన్నరాత్రి కోళ్ళగూడు ఆ జామిచెట్టు కింద ఉంటే అందులోంచి ఓ పెట్టని ఎత్తుకుపోయిందిట నక్క! ఆ మర్నాడు– "నిన్నటేల గెదిలో ఎడితే తడికె తోసుకొచ్చి మరీ ఎత్తుకుపోనాది రొండో పెట్టని! సూడు ఆ ముండ నక్కసొరవ!" అని ఆశ్చర్యపోయింది వరాలమ్మ.

"అది ఇయాళొస్తే - ఒస్తదిలే! మరిగింది కదా రుసి!–ఒస్తే దాని సొరవ నాను జూడ్డం కాదు! దానికియాళ దేవుణ్ని జూపిస్తాను!", అని శపథం పట్టేడు వీరన్న.

అందుకే అతను పగబట్టి కూర్చున్నాడు. అతని చేతిలో దుడ్డుకర్ర యమవాహనపు కొమ్ములా, నిటారుగా నిలబడ్డ జెర్రిపోతు తోకలా ప్రతీకారం కోసం పనిగటుకు నిరీక్షిస్తోంది,

రెండు గంట లయింది.

చంద్రుడు, అప్పనంగా తిని బలిసిన దత్త పుత్రుళ్ళా వెలుగుతున్నాడు. బోడి కొండలు, బ్యాంకుల నిండా డబ్బు దాచుకున్న షావుకార్లలా నిశ్చింతగా నిద్రపోతున్నాయి. మత్తెక్కిన మదవతిలా చల్లగాలి మెత్తగా పడుకొంది.

అయితే —

కోళ్ళగూడు క్రింద కూర్చున్న ఒంటి కోడి పెట్టకి నిద్ర రాకుండా ఉంది. జీవితం దానికి అర్థం కాకుండా ఉంది.

తను ఎందుకు పుట్టింది? ఎందుకు ఏ చోడి గింజలు మింగి ఏ పెంట పురుగుల్ని భక్షించి ఈ విధంగా ఎందుకు ఎదిగి, ఏ పుంజుతో భోగించి, ఎన్నెన్నో గుడ్లు ఎందుకు పెట్టి, ఏ పిల్లల్ని ఎందుకు పొదిగి, ఎవరి కోసం ఇలా కాలంతో పాటు పెరిగి, ఈ సమయంలో ఈ గూడు కింద ఇలా వణుకుతూ ఎందుకు కూర్చుంది? తల్లిని బాధపెట్టి బైటపడి, తనని తాను తినుకొని ఈ రూపంలోకి బాధపడుతూ మారి, బాధని బద్దలు చేసుకొని గాలికి ఉక్కిరిబిక్కిరయి అందుకు ఎలాగో తట్టుకొని, భయపడుతూ తల్లిచాటున మసిలి, దొరికిన కీటకాన్ని హింసించి చంపి తిని పెరిగి, పరుల హింసకి భయపడి ఒదిగి, ఎందుకు తను జీవిస్తోంది? తను చేసే నిత్య హింసని తనెప్పుడైనా ఎన్నటికైనా త్యజించగలదా? హింసకి బలి కాబోతానేమోననే అనుక్షణ భయంనుంచి తనకి ఎన్నటికైనా ఎప్పటికైనా విముక్తి అంటూ ఉంటుందా?

కోడిపెట్ట వేదం వినలేదు. కురాన్ చదవలేదు, బైబిల్ చూడలేదు. అది ఎమ్మే చదవలేదు. కథలేవీఊహించలేదు. దానికి స్పష్టంగా ప్రశ్నలు వేసుకోడంకూడా (పాపం!-) సరిగా రాదు. కాని. ఆ సమయంలో ఆ గూడుకింద అది, గుడిలో నిరాకారుడైన దేవుడిముందు రెక్కలొచ్చిన కొశ్చన్ మార్కు ధిక్కరించి కూర్చున్నట్టు కూర్చుంది.


శుచీ, రుచీగల

చల్లని పానీయాలకు, ఐస్క్రీం, ఫ్రూట్ సాలిడ్‌లకు

రవీంద్ర కూల్ డ్రింక్సు

పెట్టింది పేరు

ఒక్కసారి దయచేయండి

మీకే తెలుస్తుంది

హెడ్ ఆఫీసు :

ఏలూరురోడ్డు సెంటర్ :: విజయవాడ-2.

బ్రాంచి ఆఫీసు :

బీసెంటురోడ్డు సెంటర్ :: విజయవాడ 7.

అంతలో అది అదిరిపడింది.

ఎక్కడో చిన్నశబ్దం. అదిగో చల్లనిచప్పుడు. అదేనా చావుకి పిలుపు. ఇదేనా ఆఖరి మెలిక. చావేనా బతుక్కి జవాబు. ముళ్ళబాధకి పీక నులుముడేనా మందు ??!!

కోళ్ళగూడు కదిలింది !!

కోడిపెట్టకి రెక్కలు నిక్క బొడుచుకున్నాయి. పక్షిలోంచి పాము పుట్టినట్టు దాని మెడ దాని రెక్కలమధ్య నుంచి లేచి సాగి నిలబడింది. భయంతో కోపంతో భగవంతుడి యెడల పగతో కన్నెర్రజేసి అది అటూ ఇటూ చూసింది.

ముంజూరు నీడలో కూర్చున్న వీరన్న ఆ గూటివైపే అలా చూస్తున్నాడు. అతని కళ్లు వెన్నెల వెలుక్కి వజ్రపు తునకల్లా మెరిసేయి.

ఆనక్క తల్లిని చూడగానే, "అమ్మా! ఎంత బావున్నావే ముండా!" అనుకున్నా డతను.

వెన్నెలకి తడిసిన బొచ్చుతో, ముద్దొచే కుచ్చుతోకతో, పాలలో పొంగిన తెల్లని కడుపుతో, రిక్కించిన చాకుల్లాంటి చెవులతో చురుకు చుర్రుక్కు చూపుతో, ఆ తల్లినక్క ఆ సమయంలో బతుకులోనిబాధ అందం, జాలీ. తెలివీ, కసాయితనం-అన్నీమూర్తీభవించినట్టుగా విచిత్రమైన అందంతోకూడుకొని ఉంది.

దాని భయమూ ధైర్యమూ బిగువూ తొందరాటక్కరి తనమూ అన్నీ చూసిన వీరన్నకి ఒక్కక్షణం తన జీవితం జ్ఞప్తికి వచ్చింది. ఆ నక్కతల్లికి అతను కళ్ళప్పగించి అలా కొన్ని క్షణాలు ఉండిపోయేడు. ఆ కోళ్ళ గూటిని ఆ నక్క తన మూతితో కాలితో ఎత్తి ఆ కోడిపెట్టని కరుచుకుపోడం అతనికి ఎందువలనో కాని చూడాలి చూడాలనిపించింది. భగవత్సృష్టి సజావుగా సాగడానికి ప్రధాన కారణమైన హింసాకాండని కళ్ళారా చూడ్డానికి అతని కళ్ళు తహతహ లాడేయి.

కానీ —

అదే రీతి హింసాకాండ జరిపించడానికి అతని చేతులు కూడా తహతహ లాడేయి, తన సొమ్ము. తన కష్టం. తన కోపం, తన పగ, అన్నీ ఆ తన శత్రువుని చూసిన కొన్ని క్షణాలకి అతనికి జ్ఞప్తికి వచ్చేయి. పచ్చని వెన్నెల్లో ఆ పచ్చటి బాణాకర్ర కత్తి మెరిసినట్టు, మెరిసింది. గొడ్డలి పడ్డట్టు ఆ జంతువు మీద పడింది.

ఆ దెబ్బకి నక్కతల్లి నాలుగడుగుల ఎత్తెగిరి దభీమనికిందపడి గిజగిజలాడింది. మరోదెబ్బకి. కదలికమాని మూల్గింది. ఇంకో దెబ్బకి నోటంట నెత్తురు కార్చి మగతగా కన్నుమూసింది.

స్పాట్ లైటులో స్టేజిరాజులా చంద్రుడు ధగధగ వెలుగుతున్నాడు. శాభాష్ !...డాబా మీద వెన్నెల్లో నీ ప్రియురాలి సిల్కుచీరెలా గాలి చల్లగా ఉంది. శాభాష్!... మొనలుదేరిన జోడు కొండలు ఎలా ఉన్నాయో మరి మీరే లెక్కేసుకోండి! వారేవ్వా! అద్దదీ!... జీబుగా పెరిగిన తుమ్మమొక్కలు నీలిముసుగుల మేల్వాంశపు అభిసారికల్లా ఉన్నాయా, లేదా? బలెబలే!!... మరింక ఆ కొండవార బంజర్లో బండరాళ్ళు ఎలా ఉన్నాయో తెల్సా?... ఎలా ఉన్నాయి?... పడుచు భార్యలు సరసాలకి పరుగుతీయగా... (పరుగుతీయగా, "పరుగు తియ్యగా"— ఫన్‌ఫన్ బాగుంది గురూ!) వినండి మరి! పడుచుభార్యలు సరసాలకి పరుగుతీయగా ముణుకులు పడిపోయిన ముసలి భర్తల్లా లేవూ ఆ బండరాళ్లు? ఏఁవంటారు? అవునోహో! అవు నోహో!

రెండు గంటలు దాటింది. దాటి చాలా సేపయింది. కొండవార బొరియలో నక్కపిల్లలు తల్లి కోసం బెంగపెట్టేసు కున్నాయి. తడిగా ఉంది, ఆకలిగా ఉంది. భయంగా ఉంది. కాని వాటికి ఆ సమయంలో వెన్నెల తడి రుచించలేదు; వాటికి గాలి దయ సోకడం లేదు. వాటికి ఆకలిబాధ తీరడం లేదు. వాటికి వాటి తల్లి సవ్వడి వినిపించడంలేదు.

(రచయితలకీ, శ్రచయిత్రులకీ అయితే చల్లగాలికీ వెన్నెలతడికీ కడుపులు నిండి పోవచ్చునేమోగాని మిగతా జంతువులకి అలా కడుపులు నిండవు.)

పిల్ల నక్కలు భగవంతుణ్ని ప్రార్థించినా బావుండును ... పాపం. రామరామ, అని

ఆయన్ని ప్రార్థించేవేమో? ... ప్రార్థించినా ప్రార్థించక పోయినా అవి తల్లికోసం కుయ్యో మొర్రో అంటూ ఏడ్చాయి. ఏడ్చేక ఏడ్చేక, ఆ మూడింటిలోనూ ఓ పిల్ల ఆ బొరియలోంచి నెమ్మదిగా కొంచెం ఎగబ్రాకి, ముందుకాళ్ళు బొరియ అంచున పెట్టి, కనిపించిన మేరకి భూలోకం అంతా అమ్మకోసం పరికించి చూసి చూసి—అలా చూస్తూ ఉండిపోయింది! దానికి ఎదురుగా...

తెల్లగా చర్మం, దాన్నిండా మచ్చలు, కొండలా కళ్ళు, గుహలా నోరు మెరుపుల్లా కళ్ళు!

పిల్లనక్కమంత్రముగ్ధలా అలా ఉండి పోయింది. ఆ తరవాత అది నెమ్మదిగా నెమ్మదిగా ఆ కొండచిలువ నోట్లోకి దాని కడుపు లోకి వెళ్ళిపోయింది. ఆ తరవాత మరో పిల్ల! దాని వెనక మూడో పిల్ల. మూడూ కూడా సృష్టిస్థితికి ఆ విధంగా లయించుకుపోబడ్డాయి.

రక్తంకక్కి స్మృతి తప్పిన తల్లినక్కలో కొనఊపిరి కొంతసేపు కొట్లాడింది. మరికొంత సేపటికి - దాని కాయం కదలిక లేకుండా పడున్నా - దాని స్మృతి మాత్రం కొంచెం కదిలింది. స్మృతి కదిలిన కొద్ది క్షణాల్లోనూ దాని మనోనేత్రం ముందు దాని జీవితం అంతా కదలాడింది.

ఎండలో నల్లకొండ నీడ, వెన్నెల్లో పైరు పచ్చగాలి, పొలాల్లో చెరుకుతోటతీపి, అంతకు ముందు అంతకంటె తల్లి పాలతీపి. మెత్తని తల్లిమూతి ముద్దు, ఆ నాడు అమ్మ వెనకపరుగు, ఓనాడు మొదటి సారిగా రుచి చూసిన మొదటి కోడి ఉప్పటి నెత్తురు, తియ్యటి మాంసం, మేకల్ని వేటాడిన రోజులు, వాటి బెదురు చూసి తన నవ్వులు, కొబ్బరి తోటల వెండినీడల్లో ఉత్సాహపు పరుగులు, తన తొలి ప్రియుడి వాడి కోరచూపులు, ప్రేమతో వాని మెత్తటి కరుపులు, కసితో అతడి వేడికౌగలింతలు, తన కడుపులో మెత్తటి శిశువుల బరువులు, తన ప్రసవం తన వేదన, తన పిల్లల అరుపులు వినగానే తన చెవుల్లో పులకరించిన స్వర్గమే తన గుండెల్లోంచి పాలధారగా ప్రవహించిన వైనం, పిల్లలతో తన ఆటలు, వాటి కోసం తన యాతనలు, దుర్మార్గులతో తన పోట్లాటలు, మొదటిసారి మనిషి రాక్షసుణ్ని చూడగానే తనకి కలిగిన జుగుప్స, తమ జాతివారే అయినప్పటికీ మనుష్యులకమ్ముడుపోయిన కుక్కలతో తన కాట్లాటలు, పూలవాసనలు, పాముల పడగలు, వానజల్లులు, పందుల వికృతాలు, చల్లని గాలులు, నల్లమబ్బుల రంగు విల్లులు, వెండిమబ్బుల వెలుగులు, ఆకలితో తన పరుగులు, అలసటతో తనపడకలు, అనుక్షణం ఆనందాలు, అనునిత్యం భయాలు, ఆకలి కోసం తను చేసిన హింసాకృత్యాలు, ఎల్లప్పుడూ రక్తపాతాలూ. ఒహో! అయ్యో! అరె! ... ఏఁవిఁటిది? ఎందు కిది? ఎక్కడ కిది? నన్నెందుకు పుట్టించేవు? ఎందు కిలా చంపుతున్నావు? ఎన్నెన్ని ఆశలు కల్పించేవు! ఎన్నెన్ని పాపాలు చేయించేవు! ఎన్నెన్ని హింసలు పెట్టేవు, పెట్టించేవు! ఎన్ని హింసలు ఎన్ని హింసలు, నాకెందుకీ పుట్టుక? ఎందుకీ చావు? ఏమవుతారు. దిక్కుమాలిన నా పిల్లలు? ఏ హింసలు, ఏ హింసలు...

తెల్లవారేసరికి నక్కతల్లి చచ్చి పడుంది. దాన్ని ముఖాన్న నెత్తుటి నవ్వొకటి మాత్రం ముద్రగా మిగిలిపోయింది. దాని గుండెల్లోంచి చిమ్మిన రక్తమూ, పాలు బూడిదలోకి జారి అక్కడ ఇంకిపోయేయి. తండ్రులు చేసిన పాపాలకి తనయులు శిక్షనుభవించడమే నిజమైతే, "ఈ పాపం అంతా— సత్యనారాయణమూర్తి, తండ్రీ —నీదే ఈ పాపంఅంతా!" అన్నట్టుగాఉందిఆనెత్తుటినవ్వు.

మర్నాడు వీరన్నకంటేముందుఅతని ఆవదీ వారి పిల్లలూ నిద్రలేచేరు. ఆ చచ్చిననక్కని చూసేసరికి వారి ముఖాలు సూర్యకాంతిలో మావిడి మొక్కల్లా ఆనందంతో మెరిసేయి వికసించేయి.

"సచ్చింది. రాచ్చసిముండ!" అని కసిగా తిడుతూ చూసింది వరాలమ్మ.

ఆ ఇంటి పిల్లలూ దారంటపోయే పిల్లలూ, వార్త విని వచ్చిన పిల్లలూ అంతాకూడా నక్క చుట్టూచేరి నక్కచావుకి హర్షిస్తూ చప్పట్లు

కొడుతూ దాని చుట్టూ ఉత్సాహంతో గెంతి గెంతి ఆడేరు.

వీరన్న, ఎనిమిది గంటలకు నిద్రలేచి, నక్క చిక్కడి, తనచేతుల్లో చచ్చినందుకు తృప్తిగా నవ్వి. కోడిపెట్టని తీసి దాన్ని తన గుండెలకి అదుముకొని దాన్ని ప్రేమగా నిమిరేడు.

ఆ కోడిపెట్ట తెల్లగా ఉంటుందే కాని దానికి ఎర్రనిరంగు పులిమేరు. రక్తం పూసుకున్నట్టుగా ఆ రంగులో ఆ ఎండలో అది భగభగ లాడింది; వీరన్న చేతి స్పర్శకి పడవడ వణికెంది.

అంతలో—

ఓ పోలీసు జవాన్ని తీసుకొని, పక్కవూరి వీరినాయుడు అక్కడికి వచ్చేడు.

"అదిగో! అది నాకోడే! దాన్తో జోడు మరి రెండు కూడా ఉండాలి! మూడ్రోజుల కిందట ఎవరో ఎత్తుకు పోయేరు!" అన్నాడు వీరినాయుడు.

పాతకేడీ వీరన్న ఇసుమంతైనా భయపడ లేదు, చెక్కుచెదర్లేదు.

"మిగతా రొండూ ఏయిరా, వీరన్నా?", అని అడిగేడు పోలీసు జవాను.

"నక్కెత్తుకు పోనాది!" అన్నాడు వీరన్న నవ్వుతూ

వీరినాయుడూ పోలీసు జవానూ ఆ చచ్చిన నక్కవైపు అసహ్యంగా చూసి, ఆ వెంటనే వీరన్నని పోలీస్‌స్టేషన్‌కి నడిపించుకు పోయేరు. వరాలమ్మా, పిల్లలూ గొల్లుమని ఏడ్చేరు. రాత్రల్లా నిద్రలేని కోడిపెట్టకి ఈ కొత్త పరిణామం ఏమిటో ఎందుకో అర్థంకాక, దానికి విసుగేసింది. "ఛీ! ఈ దేవుడి లోకం గురించి ఆలోచిస్తేనే పాపం!" అని ఛీత్కరించుకొని అది వీరినాయుడి చేతుల్లో నిద్రపోయింది. ఆ తర్వాత, చచ్చి చెడి ఎప్పుడో ఒకప్పుడు ఎవరింట్లోనో ఒక రింట్లో అది సలావుగా మారే ఉంటుంది.

* * * *

[వీరినాయుడి కోడిపెట్టల్ని వీరన్న ఎత్తుకు పోయేడు. వాటిలో రెండింటిని వీరన్న ఇంటి నుంచి దొంగనక్క కరుచుకుపోయింది. నూకునాయుడి పదిసెంట్ల భూమిని తన పది ఎకరాల్లోనూ వీరినాయుడు కలిపేసుకున్నాడు. అందు గురించి నూకునాయుడు దావాతీగా ప్లీడరుగుమాస్తా అతని డబ్బంతా ఎగేసేడు. ప్రతివాదైన వీరినాయడిదగ్గర పెద్దప్లీడరుగారు అయిదువందలు (పది సెంట్ల ఖరీదే అంత) ఒడికేసేరు. వీరినాయుడి బంజరుభూమిని వీరరాజుగారు ఆక్రమించేసేరు. ఆక్రమించుకున్న ఆస్తులన్నీ వారు తన చిన్నభార్యావారి పేర్న పెట్టిఉంచేరు. వాటివల్ల వచ్చే రాబడంతా ఆవిడ తన తమ్ముడి ఇంటికినడిపేసింది. ఆతమ్ముడు ఆసొమ్మంతా తన ఉంపుడు కత్తెకి ఇచ్చేసేడు. ఆ ఉంపుడు కత్తె ఆ డబ్బంతా తనకి నచ్చినవాడికి ఇచ్చేసింది. ఆ నచ్చిన వాడు సినిమా చిత్రం కోసం మెడ్రాస్‌వెళ్తే తారలూ, డైరెక్టర్లూ కొంత డబ్బు తినేసేరు; మిగతాది ఓ నాటుకోటి చెట్టియారు లాక్కున్నాడు; ఊరివారి డబ్బునీ కార్మికుల కష్టాన్నీ దోచుకున్న చెట్టియార్ గారి చేత ఓ మార్వాడీ దివాలా తీయించేడు. మార్వాడీగార్ని ఓ తాబీతర్లావారు తమ ధృతరాష్ట్రపు కౌగిట్లో కలుపుకున్నారు. తాబీతర్లా వార్ని ఓ ఇంగ్లీషు కంపెనీ రాజ్యంవారు లాగుదామని చూస్తున్నారు. వీరందర్నీ ఓ అమెరికన్ సిండికేట్ సామ్రాజ్యం వారు చెరచడానికి వారి రెక్కలు పట్టుకొని గిజగిజ లాడిస్తున్నారు, సిండికేట్ వారి కాలికింద ఇసకని కొందరు జపానేయులు దొలుస్తున్నారు, వారి సీటుకింద వేరొకరు గోతులు తవ్వుతున్నారు, వార్ని మరొకరు, మరొకర్ని ఇంకొకరు, ఇంకొకణ్ని వేరొకడు, వేరొకణ్ని వీడు, వీణ్ని వాడు, వాణ్నివీడు, వీణ్ని ఇది, దీన్ని వాడు, వాణ్ని మరొకడు మరొకణ్ని వేరొ...]

★